పెట్టుబడి సాయం అందేనా?

- వానాకాలం సీజన్ నుంచి అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- సాగు పనులు ప్రారంభమైనా నేటికీ అందని పెట్టుబడి సాయం
- రైతు భరోసా లబ్ధి కోసం అన్నదాతల ఎదురుచూపు



ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సహాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే వానాకాలం సీజన్ నుంచే పెట్టుబడి సాయాన్ని ప్రారంభిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకూ రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. ప్రభుత్వం రైతు భరోసా గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడంతో పెట్టుబడి సహాయం వస్తుందో లేదోనని రైతులు ఆందోళనకు గరవుతున్నారు.

– జహీరాబాద్ టౌన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి రూ.5వేల చొప్పున ఖరీఫ్, రబీ రెండు సీజన్‌ల్లో పెట్టుబడి సాయం ఇచ్చింది. ఈ పథకం ద్వారా ప్రతి సీజన్‌లో తప్పకుండా రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సహాయాన్ని కొనసాగిస్తూ ఎకరాకు రూ.15వేల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీనిచ్చిన విషయం తెలిసిందే.. అధికారంలోకి వచ్చిన తరువాత పాత పద్ధతిలోనే ఎకరాకు రూ.5వేలు అందజేసి ఖరీఫ్ సీజన్ నుంచి రూ.15 వేలు ఇస్తామని చెప్పింది. పంట సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయడంలేదు.

డబ్బులు జమ చేయాలి



వానకాలం సీజన్ ప్రారంభమైనందునా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం.. ఎకరానికి రూ. 15 చొప్పున పెట్టుబడి సాయం అందజేయాలి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే సమయం దాటిపోయింది. ప్రభుత్వ స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలి.

– నౌబాద్ జగన్నాథ్, ధనసరి

అప్పులు చేసి ఎరువులు, విత్తనాల కొనుగోలు

పెట్టుబడి సాయం వస్తుందని రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను కొనుగోలు చేసుకుంటున్నారు. జహీరాబాద్ వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం, కోహీర్, న్యాల్‌కల్ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో 74వేల మంది రైతులు ఉండగా 71,600 వేల మంది అర్హులున్నారు. వీరికి రబీ సీజన్‌లో పాత పద్ధతిలోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బు జమ చేసింది. అదేవిధంగా వానాకాలం సీజన్‌కు సంబంధించిన డబ్బులను జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎంపీ షెట్కార్‌కు సన్మానం



ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీగా గెలిచిన సురేష్‌షెట్కార్‌ను అధికసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల బాధ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి, జిల్లా, డివిజన్ బాధ్యులు ప్రసాద్, ఓంప్రకాష్, నరేష్ యాదవ్, పెద్దసాయిలు, నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంటల వివరాల నమోదు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల నమోదును ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మండలంలో అత్యధికంగా పత్తి పంట సాగవుతోందన్నారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

మోడల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ ప్రభుత్వ మోడల్ కళాశాలో ఈ నెల 22వ తేదీన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22న ఉదయం10.30 గంటలకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ టీసీ, పదో తరగతి హాల్ టికెట్ కాపీలు, ఫలితాల షీట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. పత్రాల సమర్పణకు గ్రేస్ సమయం ఇవ్వబడదన్నారు. స్పాట్ అడ్మిషన్లు ప్రారంభించే ముందే ఆయా గ్రూపుల్లో ఉన్న ఖాళీల వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బేగారి పోచవ్వకు బీఆర్ఎస్ తరఫున మంజూరైన రూ.2లక్షలు బీమా చెక్కును అందజేశారు. పోచవ్వ భర్త సామేల్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. పార్టీ సభ్యత్వం ఉండటంతో బీమా మంజూరైంది. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, మాజీ ఆత్మకమిటీ చైర్మన్లు రాంసింగ్, దిలిప్‌కుమార్, నాయకులు నారాయణరావు, సాయిగొండ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): టీఎస్ ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. నర్సాపూర్ నుంచి జిన్నారం మీదుగా పటాన్‌చెరు వరకు నూతనంగా కేటాయించిన ఆర్టీసీ బస్సు సర్వీసును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ సేవలను అందిస్తోందన్నారు. మండల కేంద్రమైన జిన్నారానికి మరిన్ని బస్సు సర్వీసులను పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగు రమేష్, నాయకులు రవి, నరేందర్‌గౌడ్, పుట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



జిన్నారం: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న రోజారాణి



మునిపల్లి: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ దశరథ్

మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

మునిపల్లి(అందోల్): బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ దశరథ్ అన్నారు. మండల పరిధిలోని పొల్కంపల్లి, గోపులారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, అనురాధ పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంలకు సన్మానం



గెజిటెడ్ హెచ్‌ఎంలను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: పదోన్నతి ద్వారా బాధ్యతలు చేపట్టిన గెజిడెట్ హెచ్ఎంలను పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జీహెచ్ఎంలుగా పదోన్నతి పొందిన రేణుక (చిరాగ్‌పల్లి), అనిత (మల్‌చెల్మ), తుల్జాబాయి (అసంద్‌గంజ్), వెంకటేశం (మొగుడంపల్లి), రేమేష్ (ధనసిరి)లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బస్వరాజ్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను పెంచేందుకు గెజిటెడ్ హెచ్ఎంలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు తులసిరాం రాథోడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, నాయకులు చిట్టిబాబు, ప్రదీప్‌కుమార్, జాఫర్, నర్సింహులు, జైపాల్‌రెడ్డి, విజయకుమార్, నాగరాజ్ పాల్గొన్నారు.

దీక్షకు తరలిన స్వర్ణకారులు

నారాయణఖేడ్: ఖేడ్‌కు చెందిన స్వర్ణకారులు (విశ్వకర్మ)లు మంగళవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర బాధ్యుడు కొండోజు నర్సింహాచారి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు తరలివెళ్లిన వారిలో ఖేడ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సత్యంచారి బాధ్యులు అశోక్‌చారి, రమేష్‌చారి, నవీన్‌చారి, రాధాకృష్ణ, మహేష్‌చారి తదితరులు ఉన్నారు.

భవానీమాతకు ఎమ్మెల్యే పూజలు



నారాయణఖేడ్: ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన సతీమణి అనుపమరెడ్డితో కలిసి మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీమాతను మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖేడ్ ఎంపీపీ చాందీబాయి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్‌పాటిల్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

23న రాధా గోవింద రథయాత్ర

జహీరాబాద్ టౌన్: హరేకృష్ణ స్వర్ణ దేవాలయం హైదరాబాద్ వారిచే ఈ నెల 23న జహీరాబాద్ పట్టణంలో రాధా గోవింద రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రతన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్యనగర్‌లోని శివాజీ విగ్రహం నుంచి రథయాత్ర ప్రారంభమై పట్టణంలోని ప్రధాన రహదారుగల గుండా షెట్కార్ ఫంక్షన్‌హాల్ వరకు కొనసాగుతుందని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో రథయాత్రకు తరలిరావాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మంజీరా క్యాంపస్‌లో స్వయంభు వెలసిన పెద్దమ్మతల్లి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మహేష్, గణేష్ మాట్లాడుతూ.. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి అభిషేకం, హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

అక్రమంగా గోవుల తరలింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సుధారాణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని సోమక్కపేట్ గ్రామ శివారు నుంచి సోమవారం రాత్రి జోగిపేటకు వధించేందుకు అక్రమంగా గోవులను తరలించే సమయంలో బీజేపీ నాయకులు అడ్డుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చిన విషయం విదితమే. కాగా మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇచ్చిన ఫిర్యాదుతో అక్రమంగా గోవులను తరలిస్తున్న జోగిపేటకు చెందిన మహ్మద్ అక్బర్, చిలప్‌చెడ్‌కు చెందిన మన్నె దశరథ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ గౌడ్, అశోక్, బీజేపీ నాయకులు రాజు, సంతోష్, దశరథ్, మురళి పాల్గొన్నారు.



చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులే తప్ప తులం బంగారం లేదు

నర్సాపూర్: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద బుధవారం చెక్కులు పంపిణీ చేసేందుకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వడం లేదు. రాష్ట్ర మంత్రులు కొండాసురేఖ, దామోదర్ రాజనర్సింహా ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు నర్సాపూర్ మండలంలో 27మందికి, శివ్వంపేట మండలంలో 97మంది పంపిణీ చేసేందుకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు నర్సాపూర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద లబ్ధిదారులకు అప్పటి వరకు అందిస్తున్న రూ.ఒకలక్ష ఒక వెయ్యి 116 లతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాగా నగదుతో పాటు తులం బంగారం వస్తదని ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశ ఎదురుకానుంది. కొత్త పథకం ఇంకా ప్రారంభం కాలేదని కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు. లబ్ధిదారులకు రూ. ఒక లక్ష ఒకవేయి 116లతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు తయారు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు.

పనులను వేగిరం చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): నిర్దేశించిన గడువులోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాల పనుల పురోగతిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రెండు నెలల్లోగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. నూతన భవనాలు పూర్తయితే విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన భవనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేష్, మండల విద్యాధికారి రాథోడ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, సీనియర్ నాయకులు పరమేష్‌యాదవ్, ఐలేష్, పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. అందరి బాధ్యత

మండల విద్యాధికారి శంకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణ.. అందరి బాధ్యత అని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. మండల పరిధిలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని, అప్పుడే భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించగలమని తెలిపారు. భూ మండలంపై పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు చెట్లు ఎంతగానో దోహదం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ,మురార్జీ, శివకుమార్, ఉపాధ్యాయులు పోట్రు రామకృష్ణ, సీఆర్పీలు నాగేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎంఈఓ శంకర్

కాలుష్య నివారణకు కృషి చేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రమాకాంత్ అన్నారు. కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దండె రమాకాంత్ మాట్లాడుతూ కాలుష్యం విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నామన్నారు. కాలుష్య నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రమాకాంత్ తదితరులు

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

పుల్‌కల్(అందోల్): బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇసోజీపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని పలు రికార్డులను, మరుగుదొడ్లను పరిశీలించారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎంపీటీసీలకు సన్మానం

మునిపల్లి(అందోల్): 2019–2024 జూలై 4వ తేదీన ఎంపీటీసీల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులను మంగళవారం ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తెన్‌మొళి, ఉప తహసీల్దార్ కృపాదానం, ఎంపీడీఓ హరినందన్‌రావు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఒరిగిన స్తంభాలతో ఇబ్బందులు

నర్సాపూర్: కరెంట్ స్తంభాలు ఒరిగి ఎప్పుడు పడిపోతాయోనని భయంగా ఉందని పలువురు రైతులు అన్నారు. నర్సాపూర్ పట్టణ పరిధిలోని వెల్దుర్తి మార్గం పక్కన ఉన్న పంట పొలాల్లో ఉన్న హైటెన్షన్, లో టెన్షన్‌లకు చెందిన కరెంట్ స్తంభాలు ఆరు నెలల క్రితం కొన్ని ఒరిగాయని తెలిపారు. వాటిని సరి చేయాలని విద్యుత్ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకుపోయినా.. సరి చేయడం లేదని రైతులు చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాలను సరి చేయాలని వారు కోరుతున్నారు.



పొలంలో ఒరిగిన స్తంభం

మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సుష్మశ్రీ
- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న ఎంపీపీ సుష్మశ్రీ

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో పటాన్‌చెరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎంపీపీ సుష్మశ్రీ అన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు అన్ని విధాలుగా సహకరించడం ద్వారానే అనుకున్న స్థాయిలో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అభివృద్ధిలో మండలానికి ఉత్తమ అవార్డు కూడా వచ్చిందని గుర్తు చేశారు. అనంతరం ఇస్నాపూర్ ఎంపీటీసీ శ్రీశైలం మాట్లాడుతూ.. ఇస్నాపూర్, ముత్తంగిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. చెరువుల, కుంటల శిఖం భూముల్లో ప్లాట్లు చేయగా తాము అడ్డుకున్నామన్నారు. కానీ.. ఇప్పుడు రెవెన్యూ అధికారుల సహకారంతో ఇళ్లు నిర్మిస్తున్నారని మండిపడ్డారు. తాగునీటి సరఫరాలో మిషన్ భగీరథ అధికారులు విఫలం అయ్యారన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు హరితహారంలో పెంచిన చెట్లను తీగలకు అడ్డంగా ఉన్నాయని నరికివేస్తున్నారని పలువురు ఎంపీటీసీలు వాపోయారు. పీసీబీ అధికారులు సమావేశానికి రాకపోవడంపై ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతులులేని ప్రైవేటు బడులపై వేటువేయాలని విద్యాధికారిని కోరారు. అనంతరం జెడ్పీటీసీ సుప్రజ మాట్లాడుతూ.. నందిగామ గ్రామాల్లోని కిరాణ దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ మౌనం వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, ఎంఈవో పీపీ రాథోడ్, మండల వ్యవసాయ అధికారి ఉష, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ స్వప్న, ఎంపీటీసీలు పాల్గొన్నారు.